## అమెరికాలో క్వాడ్ సమ్మిట్




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## వరంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 263 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- బుధవారం 18 సెప్టెంబర్ 2024

# మాది ఫామ్‌హౌజ్ పాలన కాదు



● అమరుల స్థూపం వద్ద నివాళి.. ● ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జెండా ఎగిరేసిన తెలంగాణ సీఎం...

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పీసీ డబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రస్థానంలో అత్యంత కీలకమైన రోజు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లోతైన ఆలోచన చేసి ఈ శుభ దినానికి ప్రజా కోణా హైన్ని జోడిస్తూ "ప్రజా పాలన దినోత్సవం" గా జరపాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎంగారు జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు."ప్రజా పాలన దినోత్సవం.. ఈ నిర్ణయం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష. వారి ఆలోచన. నాటి తెలంగాణ సాయుధ పోరాట స్పూర్తి. ఈ నిర్ణయాన్ని ఎవరైనా తప్పుపడితే వారిది స్వార్ధ ప్రయోజనమే అవుతుంది తప్ప ప్రజాహితం కాబోదు" అని అన్నారు."తెలంగాణ భౌగోళిక స్వరూపం బిగించిన పిడికిలి మాదిరిగా ఉంటుంది. ఆ పిడికిలి పోరాటానికి సంకేతం. తెలంగాణలో అన్ని జాతులు, కులాలు, మతాలు కలిసికట్టుగా ఉంటాయన్న సందేశం అందులో ఇమిడి ఉంది. ఈ ఐక్యతను, ఈ సమైక్యతను దెబ్బతీసే విధంగా సెప్టెంబర్ 17 ను కొందరు వివాదాస్పదం చేయడం మంచిది కాదు" అని ముఖ్యమంత్రి హితవు పలికారు.జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా, సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చడం, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ, గద్దర్ పేరిట అవార్డులు, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును ఖరారు చేయడం వంటి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేపట్టిన అనేక చర్యలను ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు."ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు మాకు గుర్తుంటాయి. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా పాలన ఉంటుంది. తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ. వారి ఆకాంక్షలే. మా కార్యాచరణ" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని




**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పీసీ డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాణి కుముదిని నియమితులయ్యారు. ప్రస్తుత కమిషనర్ పార్థసారధి పదవీకాలం ఈ నెల ఎనిమిదో తేదీతో ముగియడంతో ఆయన స్థానంలో రాణి కుముదిని నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. మూడేళ్లపాటు రాణి కుముదిని ఎస్ఈసీగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1988 బ్యాచ్‌కు చెందిన కుమిదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు చేపట్టారు. 2023 ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. అప్పటి కెసిఆర్ ప్రభుత్వం ఆమెని తిరిగి అదే హోదాలో కొనసాగించింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నూతన ఎస్ఈసీ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

# చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం పెంపు

## బిసి సంక్షేమంపై సిఎం చంద్రబాబు నిర్ణయం



**విజయవాడ, సెప్టెంబర్ 17 (పీసీ డబ్ల్యూ న్యూస్):**చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి సవిత తెలిపారు. ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని ప్రకటించారు. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన బిసి సంక్షేమంపై సమావేశం అయింది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి సవిత నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. రూ.110 కోట్ల డైట్ ఛార్జీల బకాయిలు విడుదలకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రూ.20. 52 కోట్ల కాస్మొటిక్ ఛార్జీల బకాయిల విడుదలకు

వివరాలు 2లో

# ఢిల్లీ తదుపరి సీఎంగా అతిశి

## ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన ఆప్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (పీసీ డబ్ల్యూ న్యూస్):** దిల్లీ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో..ఆయన స్థానంలో అతిషీని తదుపరి సిఎంగా ఆప్ నేతలు ఎన్నుకున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని అరవింద్ కేజీవ్రాల్ ప్రకటించిన నేపథ్యంలో తర్వాత సిఎంగా ఎవరు బాధ్యతలు తీసుకుంటారనే ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర మంత్రి అతిషిని ఢిల్లీ కొత్త సిఎంగా కేజీవ్రాల్ ప్రకటించారు. సిఎంగా ఆతిషి బాధ్యతలు చేపడతారని ఆయన వెల్లడించారు. సిఎంగా ఎవరిని నియమించాలని

వివరాలు 2లో

# రైతు కూలీలకు 12 వేలు : డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పీసీ డబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటిస్తున్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మండల దళితబంధు లబ్ధిదారులకు నాగులవంచలో రెండోవిడుత యూనిట్ల మంజూరు పత్రాలను అందజేశారు భట్టి విక్రమార్క.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల చేత.. ప్రజల అవసరాలకోసం ఏర్పడినదే ఈ ప్రజాపాలన ప్రభుత్వం. భారత రాజ్యాంగం మేరకు ప్రజాపాలన కొనసాగుతుంది ప్రజాస్వామ్యని గౌరవించ్చే ప్రతి ఒక్కరు ఈ ప్రజాపాలనను స్వాగతించాలి.గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమై ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పాలనానుండి విముక్తి కల్పించాం అని అన్నారు. ఇక ప్రజా పాలనలో అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతూ ముందుకు పోతున్నాం. రైతులకు పంట,వ్యక్తి ఇన్సూరెన్స్ తో పాటుగా సోలార్ పంపు సెట్లతో తో ఆదాయం వచ్చేలే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేలు చొప్పున ఇచ్చే ఆలోచన ప్రభుత్వం చేస్తుంది అని పేర్కొన్నారు. ఐకేపీ మహిళలు ద్వారా ఆర్గానిక్ ఫార్మిగ్ ఏర్పాటు చేసి రసాయనం లేని వ్యవసాయం చేసేలా కృషి చేస్తున్నాం. ప్రజాసంక్షేమం కోసమే మా పాలన పనిచేస్తుంది. పక్కదారి పట్టిన దళిత బందు యూనిట్లు తిరిగి తెచ్చే బాధ్యత అధికారులదే అని భట్టి విక్రమార్క స్పష్టం చేసారు.

## ఢిల్లీ పెద్దల మెప్పకోసమే

# రాజీవ్ విగ్రహావిష్కరణ

- చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయండి
- రైతుబంధు వెంటనే ఇచ్చి నిజాయితీ చూపండి
- తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ
- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన కెటిఆర్




## బాలాపూర్ లడ్డూ మరో రికార్డు




**అత్యధికంగా 30లక్షల ఒకవేయికి వేలం**

**పోటీపడి దక్కించుకున్న బిజెపి నేత కొలను శంకర్ రెడ్డి**

**లడ్డూను ప్రధాని మోడీకి అంకితమిస్తున్నట్లు ప్రకటన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పీసీ డబ్ల్యూ న్యూస్):** బాలాపూర్ గణపతి లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. ప్రతి సంవత్సరం కొత్త రికార్డులు సృష్టించుకొని బాలాపూర్ గణెళిష్ లడ్డూ పైపైకి వెళ్తోంది. ఈసారి కూడా అందరి అంచనాలకు తగ్గట్టుగానే పోటాపోటీగా వేలం సాగింది. కొత్తగా తీసుకొచ్చిన రూల్ ప్రకారం ముందుగా గతేడాది లడ్డూ అమ్ముడుపోయిన ధర డబ్బులు డిపాజిట్ చేస్తేనే ఈసారి వేలంలో పాల్గొనే అవకాశం ఇచ్చారు. అందుకే చాలా తక్కువ మంది ఈ డబ్బులు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 27 లక్షలకు లడ్డూ వేలంలో అమ్ముడుపోయింది. దీంతో ఆ 27 లక్షలు డిపాజిట్ చేసిన కొద్ది మంది మాత్రమే ఈ వేలంలో పాల్గొన్నారు. గతేడాది ఆక్షన్‌లో పాల్గొన్న దయానందరెడ్డి కూడా ఈసారి 27 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పోటీలో ఉన్నది తక్కువ మంది అయినప్పటికీ పోటీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పోటీలో ఉన్న కొద్దిమంది లడ్డూ కోసం హోరాహోరీగా తలపడ్డారు. చివరకు 30 లక్షల ఒక వెయ్యి రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది ఈ లడ్డూను 27 లక్షల రూపాయలకు ఈయన దక్కించుకున్నారు. ఇసారి కూడా 27 లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పోటీ పడి మరీ భారీ ధర చెల్లించి లడ్డూను ఇంటికి తీసుకెళ్లారు. గతేడాది లడ్డూ దక్కించుకున్న తర్వాత బాగా కలిసి వచ్చిందని అందుకే ఈసారి పోటీ పడి మరీ సొంత చేసుకున్నట్టు చెప్పుకొచ్చారు. బాలాపూర్ గణెళిశ్ లడ్డూ వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. 30లక్షల 1000 రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ రూ.27 లక్షలు పలికింది. స్థానికేతరుడైన దాసరి దయానంద్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు.

వివరాలు 2లో

## గల్ఫ్ దేశాల్లో పనిచేస్తోన్న తెలంగాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** గల్ఫ్ కార్మికులు దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలు పరిహారం. 2023 డిసెంబర్ 7 నుంచి చోటు చేసుకున్న ఘటనలకు ఇది వర్తిస్తుంది. గల్ఫ్ కార్మికుల స్థితిగతుల అధ్యయనానికి అడ్వైజరీ కమిటీ ఏర్పాటు ప్రజా భవన్ లో కొనసాగుతోన్న ప్రజావాణి కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా "ప్రవాసి ప్రజావాణి" కౌంటర్ ఏర్పాటు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్ల అడ్మిషన్లలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం.

## తెలంగాణ వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ వారు విరాళంగా 65 లక్షల సహాయం...




**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరద బాధితుల సహాయం కోసం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సిబ్బంది ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 65 లక్షలు విరాళంగా అందించారు. బ్యాంకు చైర్మన్ కె. ప్రతాప రెడ్డి బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మక్కడ్ చైర్మన్ సెక్రెటరీ ఆర్. యశ్వంత్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి ఆ మేరకు చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో స్పందించి ప్రభుత్వానికి అండగా తమ వంతు చేయూతను అందించిన APGVB కార్యవర్గానికి, సిబ్బందికి ఈ సందర్భంగా సీఎం కు ధన్యవాదాలు తెలియజేశారు.

## చట్టసభల్లో బీసీలకు ప్రాతినిధ్యం పెంపు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వసతి గృహాల్లో సాధారణ మరమ్మతులకు రూ.10 కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరణ చేస్తున్నట్లు చెప్పారు. బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలపై నివేదికలు కోరుతున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతానికి రూ.10 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. కమ్యూనిటీల వారీగా అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నట్లు మంత్రి సవిత వివరించారు. ఏపీలో 5 చోట్ల ఫ్యాకల్టీ డెవలప్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. కాపు భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందిస్తామని మంత్రి సవిత వెల్లడించారు.

## అమెరికాలో క్వాడ్ సమ్మిట్

**- 21 నుంచి యూఎస్‌లో పర్యటించనున్న మోడీ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన ఖరారయ్యింది. ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. జో బైడెన్ ఆధ్వర్యంలో డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో జరగబోయే క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొననున్నారు. ఈ సమ్మిట్‌కు ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ పీఎం ఫుమియో కిషిడా సమావేశమవుతారు. ఈ సమ్మిట్ ఈసారి భారత్ లో జరగాల్సి ఉంది. అయితే అమెరికా విజ్ఞప్తి మేరకు 2025లో క్వాడ్ సమ్మిట్ భారత్ లో నిర్వహించనుంది. సెప్టెంబర్ 22న ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. ఈ ఈవెంట్‌కు 24 వేల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉంది. సెప్టెంబర్ 23న న్యూయార్క్‌లో జరిగే యూఎన్ సమ్మిట్ ఫర్ ధి ఫ్యూచర్ లో ప్రధాని మోదీ పాల్గొననున్నారు.

# వరంగల్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి..

- **విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం**
- **వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం, పోచమ్మ కుంట మోడల్ గ్రేవీ యార్డ్, గ్రేటర్ వరంగల్ పరిధిలోని పార్కు స్థలాల ఆక్రమణ, రీజినల్ సైన్స్ సెంటర్ భూమి ఆక్రమణ, నాలాల ఆక్రమణలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి, నిధుల కేటాయింపు, డంపింగ్ యార్డ్, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు, ఓ ఆర్ ఆర్ పనులు, కాజీపేట ఆర్ఓబి, తదితర అంశాలపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, మున్సిపల్, సాగునీటి పారుదల, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో ఆయా అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రెండో పెద్ద నగరమైన వరంగల్ ను మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారని, అందుకే తనను ఈ జిల్లాకు ఇన్చార్జిగా బాధ్యతలను అప్పగించారని అన్నారు. అందుకే వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఎడ్యుకేషన్, హెల్త్ అనేవి రెండు కళ్ళలాంటివని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం తో పాటు వరంగల్ నగరాభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించినట్లు పేర్కొన్నారు. నగర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులను కూడా విడుదలయ్యేందుకు కృషి చేస్తామన్నారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వాటికి నిధులను కేటాయిస్తామన్నారు. పేదలకు పెద్దదిక్కుగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ఉందని ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల ఉన్న జిల్లాలు , చత్తీస్గఢ్ రాష్ట్రం నుంచి వైద్య సేవల కోసం నిరుపేదలు వస్తుంటారని, అలాంటి ఆసుపత్రిలో మందుల కొరత అనేది సహించలేనిదని అన్నారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో మందుల కొరత రాకుండా చూసుకోవడంలో అధికారులు ఎంత మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో విద్య వైద్యంపై ఎమ్మెల్యేలు తరచుగా పర్యటించాలన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందే విధంగా పర్యవేక్షించాలన్నారు. అధికారులు సమన్వయంతో కృషి చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చునని అన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో ఫిర్యాదులను స్వీకరించి వాటికి సంబంధించిన నివేదికను అందించాలని కలెక్టర్ ను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముప్పు నుండి ప్రజలను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కాపాడినందుకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పాత్రికేయులకు ఇంటి స్థలాల కేటాయింపు విషయంలో తమ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తప్పకుండా ఇంటి స్థలాలను అందిస్తామన్నారు. గత ప్రభుత్వం పాత్రికేయుల ఇంటి స్థలాల విషయంలో కాలయాపన చేసిందని పేర్కొన్నారు. అలా కాకుండా అర్హులైన వారి జాబితాను ఆయా కమిటీలు అందిస్తే ఇంటి స్థలాలను కేటాయించేందుకు ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటి స్థలాల విషయంలో ఆయా యూనియన్లు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో ఒకసారి సమావేశమై చర్చించాలన్నారు. ఇటీవలనే హైదరాబాదులో పాత్రికేయులకు ఇళ్ల స్థలాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించినట్లు పేర్కొన్నారు. నాలాలపై ఎలాంటి నిర్మాణాలు ఉన్న ఉపేక్షించవద్దని, ఎంతటి వారు ఉన్న వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలపై నిరుపేదలు ఉన్నట్లయితే వారికి సరైన చోట నివాసం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే తీసుకుంటుందని, ఎంత పెద్ద వాళ్ళు తీసుకున్న ప్రభుత్వం ఊరుకో దన్నారు. కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనులు ఏవైనా ఉన్నట్లయితే వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కళాక్షేత్రం ప్రారంభోత్సవం కోసం వచ్చే నెల రెండవ తేదీన ముఖ్యమంత్రి పర్యటన ఉండనుందని పేర్కొన్నారు. వరంగల్ విమానాశ్రయం సంబంధించిన వివిధ అంశాలపై ఆర్ అండ్ బి మంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వరంగల్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వరంగల్ పర్యటనకు వచ్చినప్పుడు డంపింగ్ యార్డ్ సమస్య ప్రస్తావనకు వచ్చిందని ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం జరగాలని అన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం మరిన్ని నిధులను కేటాయించాలని అన్నారు. స్మార్ట్ సిటీ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. నాలాల ఆక్రమణ తొలగింపు విషయంలో కార్పొరేషన్ కు అనేక ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ, సాగునీటిపారుదల, ఇతర శాఖల అధికారులు సహకారం అందిస్తే నాలాల విస్తరణ పనులను పూర్తి చేయవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నగరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. వరంగల్ లో అనేక పురాతన ఆలయాలు నెలవై ఉన్నాయని, వాటి పునరుద్ధరణ పనులను పూర్తి చేసినట్లయితే ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా వరంగల్ నిలుస్తుందన్నారు. కేంద్రం నుండి వరంగల్ అభివృద్ధికి నిధులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్కు స్థలాలు చాలా చోట్ల కబ్జాకు గురయ్యాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. విలువైన పార్కు స్థలాల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ ఎంజీఎం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. ఆయా జిల్లాలకు సంబంధించిన, గ్రేటర్ వరంగల్ సంబంధించిన వివిధ అంశాలను గురించి కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే తెలియజేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్, కుడా అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీ తదుపరి సిఎంగా అతిశి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులతో కేజ్రీవాల్ చర్చించారు. అనంతరం శాసనసభా పక్ష సమావేశంలో మంత్రి అతిషి పేరును ప్రతిపాదించారు కేజ్రీవాల్. ఈ ప్రతిపాదనకు శాసనసభాపక్షం ఆమోదం తెలిపింది. ఇక, మంగళవారం సాయంత్రం కేజ్రీవాల్ సిఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం లెఫ్ట్ నెంట్ గవర్నర్ ను కలిసి తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కు అందజేయనున్నారు. సిఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ప్రజలు తనకు సర్టిఫికెట్ ఇచ్చేంతవరకూ ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని స్పష్టంచేశారు. సీఎం కుర్చీ నుంచి దిగిపోయి.. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి ప్రజల్లో తన విశ్వసనీయతను పరీక్షించుకుంటా నని ప్రకటించారు. మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ గతవారమే తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ క్రమంలోనే మంగళవారం కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయనున్నారు. ఈమేరకు లెఫ్టనెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనాను కలిసేందుకు ఆయన అపాయింట్‌మెంట్ కోరగా సాయంత్రం 4.30 గంటలకు సమయం కేటాయించినట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించిన తర్వాత.. కొత్త సీఎంగా ఆతిశీ పేరును ఆప్ ఎమ్మెల్యేలు గవర్నర్‌కు సమర్పించనున్నారు. సెప్టెంబరు 26-27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఆ సమావేశాల్లోనే ఆతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి డిప్యూటీ సీఎంగా ఎవరినీ ప్రకటించే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే నవంబరులోనే మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండు చేస్తున్నారు. అయితే, ఎన్నికల సంఘం మాత్రం ముందస్తుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. ఫిబ్రవరిలోనే ఈసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం.కాగా, మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ ఇటీవలే బెయిల్ పై విడుదలయ్యారు. అయితే, బెయిల్ మంజూరు చేస్తూ.. సిఎం కార్యాలయానికి వెళ్లకూడదని, అధికారిక్ల ÷ల్స్ పై సంతకం చేయకూడదని కేజ్రీవాల్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో కేజ్రీవాల్ సిఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# బాలాపూర్ లడ్డూ మరో రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

వేలంపాట అనంతరం ఉదయం 11 గంటలకు బాలాపూర్ గణెళిశుడి శోభాయాత్ర ప్రారంభం అయ్యింది. లడ్డూను దక్కించుకున్న అనంతరం కొలను శంకర్‌రెడ్డి మాట్లాడారు. బాలాపూర్ లడ్డూ మా కుటుంబానికి దక్కడం ఇది తొమ్మిదో సారి. ఈ లడ్డూను ప్రధాని మోదీకి అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ వేలం పాట కొనసాగుతోంది. మొదట రూ.450తో ప్రారంభం కాగా.. 2016లో రూ.14.65 లక్షలు, 2017లో రూ.15.60లక్షలు, 2018లో రూ.16.60 లక్షలు, 2019లో 17.60 లక్షలు, 2021లో రూ.18.90 లక్షలు, 2022లో రూ.24.60 లక్షలు పలికింది. 2020లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే రాజీవ్ విగ్రహావిష్కరణ

- **చేతనైతే ఇచ్చిన హామీలు అమలు చేయండి**
- **రైతుబంధు వెంటనే ఇచ్చి నిజాయితీ చూపండి**
- **తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ**
- **తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన కెటిఆర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని స్థాపించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టారని.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నారని... కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుందంటూ ఎద్దేవా చేశారు. మీకు చేతనైతే హామీలు అమలు చేయండి.. 420 అడ్డగోలు హామీలు అమలు చేయండి. చేతనైతే రైతుబంధు ఇవ్వండి వానాకాలంకు 14 రోజులే మిగిలింది. చేతనైతే కరెంటు సరిగా ఇవ్వండి. చేతనైతే పింఛన్లు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి. రేవంత్ రెడ్డి చేతనైతే మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి అంటూ హితవుపలికారు. పోలీస్ బండ్లల్లో డీజిల్ పోయడానికి నిధులు ఇవ్వడంలేదని విమర్శించారు. రామగుండంలో రూ.2 కోట్లు డీజిల్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. అక్కడ బంకు వాళ్లు పోలీస్ బండ్లకు డీజిల్ పోయడం లేదని తెలిపారు. ఇంకో 14 రోజుల్లో వర్షాకాలం ముగుస్తుందని.. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. గురుకులాల్లో విద్యార్థులు విష ఆహారం తిని అవస్థలు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గురుకుల టీచర్లను 2500 మందిని తీసీ పక్కన పెట్టారన్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందని.. ఎక్కడ చూసినా చికెన్ గున్యాలు, డెంగ్యూలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. పల్లెల్లో ప్రజలు దోమల బారిన పడుతున్న పిచికారి లేదన్నారు. హోంగార్డులకి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమ్జ్గ÷న్సీ పెట్టే విధంగా పరిస్థితి ఉందన్నారు. ఏ ఇంట్లో చూసినా పిల్లలు జ్వరాల బారిన పడి బాధపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉంటే ఇవన్నీ పట్టించుకోకుండా కేవలం కేసీఆర్‌ను బీఆర్‌ఎస్ నాయకులను తిట్టడమే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవైపు సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలునిచ్చిన విషయం తెలిసిందే. ముందుగా తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు కేటీఆర్. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు హాజరయ్యారు.



# ఎంజీఎం ఆస్పత్రిలో ఫార్మసీ విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీ డా. కడియం కావ్య

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫార్మసీ సిబ్బందిపై ఎంపీ ఆగ్రహం
- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు..
- నిరుపేదల ప్రజల ఆరోగ్యానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఫార్మసీ విభాగాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఎంజీఎం ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ ఓ రోగి బంధువు తనకు మందులు ఇవ్వడం లేదన్న విషయాన్ని మంత్రులు, ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రోగిని తీసుకుని నేరుగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఫార్మసీ కేంద్రానికి చెరుకుని, పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను రిజిస్టర్ ను పరిశీలించారు. ఎన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో ఎంపీ స్వయంగా పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను సేకరించారు. స్వతహాగా డాక్టర్ అవ్వడం వలన క్షుణంగా మెడిసిన్స్ గురించి, సీడిఎస్ నుండి రావలసిన మందుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దాదాపు మూడు నెలలుగా మెడిసిన్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బందిపై ఎంపి డాక్టర్ కడియం కావ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు పెద్దదిక్కుగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో కనీసం పెయిన్ కిల్లర్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. మందులు అందుబాటులో లేవు అంటూ బయటకు రాయడం సరికాదని, మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం విషయాన్ని ఎంపీ డా. కడియం కావ్య మంత్రి పోగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ డా.కడియం కావ్య అందించిన వివరాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వైద్య అధికారులను మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు అందాల్సిన విద్యా, వైద్యం లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి..

- 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ -సయ్యద్ రజాలి



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యు న్యూస్):** గత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ.. 15 సంవత్సరాలు అధికారంలో లేకున్నా.., అధికార పార్టీ తప్పుడు కేసులు బనాయించిన, ఎన్ని ఒత్తిళ్లు తెచ్చిన బెదిరింపులకు భయపడకుండా.. అధికార పార్టీకి తలొగ్గకుండ, అను నిత్యం ప్రజల్లో ఉంటూ.. నమ్ముకున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడిన మన ప్రియతమ నాయకుడు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి రెండవ దఫా మంత్రివర్గ విస్తరణలో తెలంగాణ క్యాబినెట్ లో ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని, ఏఐసీసీ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శ్రీ దీపా దాస్ మున్షి కి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల్ల రేవంత్ రెడ్డి ని, కాంగ్రెస్ పెద్దలందరికీ కాజీపేట 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ్ శ్రీ – సయ్యద్ రజాలి ఒక ప్రకటనలో విన్నవించారు.

# పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రులు పొంగిలేటి, కొండా సురేఖతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లాలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ఎంపీ ఎమ్మెల్యేలతో కలిసి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంగళవారంకాకతీయ మెడికల్ కళాశాలలో డి.యం.ఇ నిధులతో రూ. 345.00 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు, గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తో కలిసి పలు అభివృద్ధి పనులలో పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జి డబ్ల్యూ ఎం సి మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ లు ప్రావీణ్య, సత్య శారదా, జీ డబ్ల్యు ఎం సి కమీషనర్ తానజీ వకాడే ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ అభివృద్ధి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. దానికి అనుగుణంగా అధికారులు పని చేయాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ అభివృద్ధి విషయంలో కేంద్రం నుండి రావాల్సిన నిధులను తీసుకురావడానికి కృషి చేస్తానాని తెలిపారు. స్మార్ట్ సిటీ, అమృత్ నిధులతో పాటు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు కావాల్సిన నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర పథకాల అమలుకు ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద దేవి, కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



**మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలో మతి స్థిమితం సరిగా లేని వృద్ధురాలు దారితప్పి మొగుళ్లపల్లి మండలంలోని వేములపల్లి, గ్రామంలో సోమవారం రోజున రోడ్డు పైన తిరుగుతున్న క్రమంలో స్థానికుడు విజయ్ వృద్ధురాలును గమనించి. వినాయక నిమజ్జనం సందర్భంగా. అక్కడే డ్యూటీ చేస్తున్న మొగుళ్లపల్లి బ్లు కోల్ట్ కానిస్టేబుల్ సారంగపాణి, విజయ్ లకు సమాచారం ఇవ్వగా తక్షణమే స్పందించి. వెళ్ళీ ఆమె యొక్క వివరాలు తెలుసుకొనగా. ఆమె పేరు అధారు కార్డు ప్రకారం దేగల వరక్క, భర్త, సమ్మయ్య,, ముదిరాజ్ కులం , వృత్తి: కూలి, ములుగు జిల్లా ఘనపురం అని తెలిసింది. వెంటనే మొగుళ్లపల్లి ఎస్ హెచ్ ఓ. బొరగల అశోక్, ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ జి. సుధాకర్ ఘనపురం లోని ఆమె సంబంధికులకు సమాచారం ఇవ్వగా ఆమె కొడుకు దెగల రవి మొగుల్లపల్లి స్టేషన్ కి రప్పించి, వివరాలు అడుగగా దేగల రవి ఈ నెల 13 వ తారీకు నుండి తన తల్లి, కనిపించుట లేదని మతి స్థిమితం సరిగా లేని కారణంగా తప్పిపోయిందని పోలీసులకు తెలుపగా. వృద్ధురాలుని అతని కొడుకు దేగల రవి కి అప్పగించడం జరిగిందని తెలియజేసారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు....

- జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి
- జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డా. కడియం కావ్య







**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా వరంగల్ ఓ సిటీ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నాటి నిజాం పాలన నుండి జవహర్ లాల్ నెహ్రు నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విముక్తి కల్పిస్తే, గత ప్రభుత్వ నయా నిజాం పాలన నుండి రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విముక్తి కల్పించారాని అన్నారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఒక ప్రత్యేకత ఉందని, ఎంతో మంది పోరాటాలు, త్యాగాల ఫలితంగా నిజాం నియంతృత్వ పాలన నుండి విముక్తి లభించిందని గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, కేఆర్ నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి సలాం కోసమే రాజీవ్ విగ్రహం..!

- తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు
- కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి

**హనుమకొండ ప్రతినిధి: సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సచివాలయం, తెలంగాణ అమర జ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టటం తెలంగాణ తల్లిని అవమానించడమే అని ఉద్యమనేత, మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అన్నారు. మంగళవారం రేవంత్ ప్రభుత్వం తీరుకు నిరసనగా బాల సముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పశ్చిమ నియోజకవర్గ కో- ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముఖ్య అతిథిగా హాజరైన కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి పాలభిషేకాలు నిర్వహించి, పూల మాలలు వేశారు. అనంతరం మర్రి యాదవ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ హయాంలోనే గత ప్రభుత్వ హయాంలో ఆ ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహానికి కేటాయించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాజీవ్ విగ్రహ ఏర్పాటు తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్య అని అని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తెలంగాణ ఎక్కడ ఏర్పాటు చేసిన అభ్యంతరం లేదని, మాజీ ప్రధానిగా ఆయన్ని గౌరవిస్తామన్నారు. ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రేవంత్ ఈ చర్యలకు పాల్పడుతున్నాడని, తెలంగాణ సమాజం ఈ చర్యలను హర్షించదని అన్నారు. రాబోయే రోజుల్లో అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని కచ్చితంగా ప్రతిష్టించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, ఉడతల సారంగపాణి, తండమల్ల వేణు, నాయకులు నార్లగిరి రమేష్, నాయిముద్దీన్, జానకిరాములు, రవీందర్ రావు, విక్రమ్, ఖలీల్, రాజు, అఫ్జల్, పరుశురాములు, రామ్మూర్తి, రఘు, మహేష్, విజయ్, రాము, మహమూద్, ఫాతిమా చారి, శంకర్, అనిల్, దేవమ్మ, సర్దార్, సుధాకర్, విద్యార్థి నాయకులు రాకేష్ యాదవ్, సుమన్, వీరు, వాసు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ ప్రతినిధి: సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా హన్మకొండ, అదాలత్ సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలసి మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి ఘన నివాళులు అర్పించారు. హన్మకొండ జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో జాతీయ పతాక ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఓడిఎఫ్ మోడల్ గ్రామాలు చేయుట కొరకు ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలో భాగంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన వంతుగా కృషి చేస్తానని సంతకం చేశారు.

# పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖతో కలిసి పాల్గొన్న ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఎస్ఎన్ఎం జంక్షన్ లో రూ. 60లక్షలతో చెప్పట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ గార్లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. అనంతరం ఎంజిఎం అస్పత్రిలో సింగల్ డోనర్ ప్లేట్ లెట్స్ (ఎస్ డి పి) బ్లడ్ బ్యాంక్, పిఎంఎస్ ఎస్ వై అస్పత్రిలో ఆధునికరించిన 14 పడకల డయాలసిస్ సెంటర్ ను మంత్రులతో కలిసి ప్రారంభించారు. అలాగే హన్మకొండ టిటిడి జంక్షన్ లో రూ. 50లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు.

# సుల్తానాబాద్ శ్రీశ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు..

- బ్రహ్మశ్రీ చిలుమోజు వీరనారాయణ చార్యులు

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17న శ్రీశ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ మహోత్సవ జయంతి వేడుకలు మహా వైభవంగా జరుపుకుంటామని విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం మాజీ అధ్యక్షులు బ్రహ్మశ్రీ చిలుమోజు వీరనారాయణ చారి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరనారాయణ చార్యులు విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలవేసి, జెండా ఆవిష్కరించి, విశ్వకర్మ సంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కుల పెద్దలు నాయకులు వీరాచార్యులు, పూసాల ఆంజనేయులు, దాసోహం వెంకటేశ్వర్లు, జూపాక కుమారస్వామి, శ్రీమంతుల సదానందం, శ్రీమంతుల సంపత్, వెల్ది గోపాల్, లక్ష్మీనారాయణ, కృష్ణమాచారి,చంద్ర సేన చారి, సత్యనారాయణ, బాలయ్య,వెంకటాచారి, రమేష్, సంతోష్, వెంకట చారి,ఆనందం, అనిల్, అబ్బోజి రాజనందం,అభిలాష్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జ్వరంతో మహిళ మృతి

**- పరిశుభ్రత కరువైన గర్మిళ్లపల్లి**





**టేకుమట్ల, 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఒకే ఒక రోజు జ్వరంతో మహిళ మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేణికుంట్ల సారమ్మ (56) ఒకే ఒక రోజు జ్వరం రావడంతో అవస్థకు గురైన మహిళ శుక్రవారం పరకాల లలిత హాస్పిటల్ లో అడ్మిట్ కాగా వైద్యులు కావలసిన పరీక్షలు చేయించి అనంతరం క్రిటికల్ పొజిషన్లో ఉందని హాస్పిటల్ సిబ్బంది మెరుగైన వైద్య కోసం ములుగు రోడ్డు దగ్గరలో గల అజార హాస్పిటల్ పంపించగా అక్కడ మెరుగైన వైద్యం కోసం బంధువులు అడ్మిట్ చేయగా వైద్యులు చికిత్స చేస్తుండగా సోమవారం వైద్యులు మహిళ మృతి చెందినట్లుగా బంధువులకు తెలిపారు. ఆ మహిళ శవాన్ని వైద్య ఖర్చులు చెల్లించిన తర్వాతనే బంధువులకు అప్పగించారు. ఒక హాస్పిటల్స్ సిబ్బంది . దాదాపుగా రెండు లక్షల 50 వేల నుండి 3 లక్షలు రూపాయలు వైద్య ఖర్చులు పేరున రాబట్టారు. మధ్య ఖర్చులను చెల్లించిన వెంటనే మహిళ శవాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు కుమార్లు శంకర్, సుధాకర్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

# సుడా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన సూడా చైర్మన్



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం, సందర్భంగా నగరంలోని సుడా కార్యాలయంలో ఈరోజు ఉదయం సూడా చైర్మన్ జాతీయ జెండా ఆవిష్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మరియు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబా సభ్యులను పరామర్శించిన బిజెపి మండల నాయకులు



**చిట్యాల, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఓడితల గ్రామం లో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు ఉడుత వనక్క తండ్రి గారైన కోడూరి రాజసమ్మయ్య గత రెండు రోజుల క్రితం మరణించడం జరిగింది మంగళవారం రోజున చిట్యాల బిజెపి మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగిందిఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గయ్య గొర్రె శశి కుమార్ మాచర్ల రఘు శ్రీపేల్లి అనిల్ మైదాన్ శ్రీకాంత్ వల్ల లా ప్రవీణ్ సుధా గాని శ్రీను రావుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేపలవేటకు వెళ్లి మృతి చెందిన ఎల్లబోయిన ఉపేందర్

**కురవి, సెప్టెంబర్17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని రాజోలు గ్రామంలో ఊరిచివర దామెర చెరువు లోకి చేపల వేటకు వెళ్లిన ఎల్లబోయిన ఉపేందర్ వలతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ఆ చేపలవల కాళ్లకు చుట్టుకొని నీళ్ల నుండి బయటకు రాలేక నీళ్లలో మునిగి మృతిచెందాడు.కురవి పోలీసు స్టేషన్ లో అతని భార్య పద్మ పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని కురవి ఎస్ఐ సతీష్ తెలిపారు.



# ప్రజా పాలన దినోత్సవంలో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు...



**కరీంనగర్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాదులోని గాంధీభవన్లో మంగళవారం ఉదయం జరిగిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్లో పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలన, పారదర్శక పాలనతో సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సోనియా గాంధీ కృషితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను అన్ని రంగాల్లో అగ్ర భాగాన ఉంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ స్ఫూర్తితో నిరంతరం ప్రజా శ్రేయసే లక్ష్యంగా అవిశ్రాంతంగా పాటుపడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని వెలిచాల రాజేందర్ రావు సూచించారు.

# చిట్యాల మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవం

**• మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్**



**చిట్యాల, సెప్టెంబర్ 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవం జరుపుకోవడం జరిగిందని చిట్యాల బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు ఆయన మాట్లాడుతూ భారతదేశ మొత్తం స్వాతంత్రం ఒకసారి వస్తే మనకు మాత్రం యొక్క నిజాం రజాకార్ల ఆధీనంలో ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా స్వతంత్రం రావడం జరిగిందని నిజాం రజాకార్లు తెలంగాణలో ఉన్నటువంటి మన ఆడబిడ్డలను నగ్నంగా బతుకమ్మ ఆడివ్వడం జరిగిందని ఎంతోమంది ప్రజలను పన్నుల పేరుతో హింసించేవారని కనబడ్డ అటువంటి మహిళలను అత్యాచా రాలు చేసే వాళ్లని ఎదురు తిరిగిన వారిని కిరాతకంగా చంపేవారని అలాంటి రజాకారులకు పాలన ఇప్పటికీ కూడా కొనసాగుతున్నదని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ విమోచన దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించకపోవడం కూడా రజాకారులను సమర్థిస్తూ ఈరోజు రాజకీయ లబ్ధి కోసం పరిపాలన కొనసాగిస్తున్నారని ఇదంతా తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నదని ఇలాంటి పార్టీలను భూస్థాపితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆయన అన్నారు కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గయ్య బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు గొర్రె శశి మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు శ్రీపెల్లి అనిల్ జిల్లా మండల నాయకులు సుద్దాల వెంకన్న గజల రవీందర్ మండల మొగిలి సుదగాని శ్రీనివాస్ సుందర్ అశోక్ చారి మైదానం శ్రీకాంత్ కెమ్మరపు ప్రభాకర్ వాళ్ళ ప్రవీణ్ రాయని శ్రీనివాస్ పిట్టల నాగరాజు చింతల రాజేందర్ చింతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బజ్జూరు చంద్రమౌళి లేకపోవడం డీలర్ల సంక్షేమానికి తీరని లోటు

**• రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్ బాబు**




**మొగుళ్లపల్లి, సెప్టెంబర్17(పిసిడబ్ల్యూ న్యూస్):** మొగుళ్లపల్లి మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ డీలర్ బజ్జూరు చంద్రమౌళి శ్రద్ధాంజలి కార్యక్రమంలో తెలంగాణ రేషన్ షాప్ డీలర్ల సంక్షేమ సంఘం మొగుళ్లపల్లి మండల అధ్యక్షులు మరియు భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భద్రయ్య అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్ బాబు పాల్గొని వారి యొక్క ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని వేడుకుం టూ 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు భతుల రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రమౌళి గత 50 సంవత్సరాలుగా రేషన్ డీలర్లల సంక్షేమం కోసం ముందు వరుసలో నిలబడి రాష్ట్రంలో ఏ పిలుపు ఇచ్చిన దానికి కట్టుబడి ఉండి అందరికంటే ముందుగా కార్యక్రమాల్లో పాల్గొని అందర్నీ సమన్వయం పరుచి అందరి యొక్క మనలను పొందిన వ్యక్తి బజ్జూరు చంద్రమౌళి. వారు ఈరోజు లేకపోవడం మా డీలర్ల సంక్షేమానికి తీరని లోటు అని అన్నారు. వారు అనేక కార్యక్రమంలో నేను ఏ పిలుపు ఇచ్చిన ఏ మీటింగ్ అయినా అందరినీ సమన్వయం పరిచి హైదరాబాద్ నడి ఒడ్డుకు గాని వరంగల్ అయితేనేమి ఎక్కడికైనా గానీ డీలర్లు అందర్నీ సమన్వయపరచుకొని మీటింగ్ తీసుకొచ్చి మీటింగును సక్సెస్ఫుల్ చేసిన వ్యక్తిగా ఈరోజు మాకు లేకపోవడం మాకు తీరని లోటు అని ఈ సందర్భంగా తెలిపారు అంతేకాకుండా వారి కుటుంబానికి ఎల్లవేళలా వారికి ఏ కష్టం వచ్చినా మేము ముందుండి వారి యొక్క కష్టాలను తీరుస్తామని అతని యొక్క కుమారున్ని తప్పకుండా మా యొక్క డీలర్ సంక్షేమంలో పాత్రులు కావాలని గౌరవ వేతనం కోసం నేను చేసే పోరాటంలో అందరం సమిష్టిగా పాల్గొని తప్పకుండా గౌరవ వేతనం పొందే విధంగా ప్రభుత్వం దిగివచ్చేలా చేసి మనం తప్పకుండా గౌరవ వేతనం సాధించే విధంగా పోరాటాలు చేసి గౌరవ వేతనాన్ని సాధించుకోవాలని సందర్భంగా పిలుపునిచ్చారు. మనం తప్పకుండా గౌరవ వేతనం సాధిస్తామని ఎవరు కూడా నిరాశ పడకూడదు అంటూ ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతరాజు రమేష్ , రాష్ట్ర కార్యవర్గం ఎదులపురం వెంకటేష్, రాజ సాంబయ్య, జిల్లా అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణ ముగుళ్లపల్లి మండల అన్ని గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రత్యేకగా నిలిచిన ముస్లిం యువకులు...



**మానకొండూర్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వినాయక విగ్రహాల నిమజ్జం సందర్భంగా మానకొండూర్ కు చెందిన కొంతమంది ముస్లిం యువకులు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మానకొండూర్ చెరువు వద్ద కు వచ్చిన భక్తులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహ్మద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు స్టాల్ ను ఏర్పాటు చేసి ఉచితంగా మంచినీళ్ల బాటిళ్లు, బిస్కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇర్ఫాన్ మాట్లాడుతూ సర్వమత సామరస్యానికి హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు మతాల పండుగలను పరస్పం గౌరవించుకోవడం మన అందరి సంప్రదాయం కావాలన్నారు. ఆ సంప్రదాయానికి కట్టుబడుతూ వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా హిందూ భక్తులకు బిస్కిట్ ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు అందించామని ఇర్ఫాన్ వివరించారు.ఈ స్టాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముస్లిం మత పెద్ద మౌలానా ముఫ్తీ నదీమొద్దీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డితోపాటు కోంఢ్ర సురేశ్, కె.శంకర్, జడల రమేశ్, ఎండీ అజహర్, మహ్మద్ మహమూద్, తాళ్లపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, నిమజ్జనం సందర్భంగా మంచినీరు, బిస్కెట్లు అందించిన ఇర్ఫాన్ ను, ఆయన మిత్ర బృందాన్ని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు..

**• చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి.**



**చిట్యాల, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రం మార్కెట్ యార్డు ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి..ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం రైతుల కోసం రైతు కూలీల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ప్రజలందరినీ ఆదుకునే దిశగా ఇచ్చినా హామీలను అమలుచేస్తూ ముందుకు సాగుతున్నది రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతునే రాజుగా చేయుటకు అనేక కార్యక్రమాలు తీసుకొస్తున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంక్షేమ పథకాలుపలాలు అందుతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య , ఓబీసీ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ , టౌన్ అధ్యక్షులుబుర్ర లక్ష్మణ్ గౌడ్, రైతు నాయకులు శివరామకృష్ణ , డాక్టర్ కిషన్ శ్రీను ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మటిక రవీందర్, చిన్నం చందర్ , ఓ నపాకల లింగన్న , పింగిలి సతీష్ రెడ్డి ,కిరణ్ రావు , మెరుగు లక్ష్మి , కనుమరుగుల సంపత్ , నల్లబెల్లి విజేందర్ రాజు నాయక్ , మార్కెట్ సూపర్వైజర్ ఆడేపు రాజేందర్ , ఆరెపల్లి మల్లయ్య, గుండ రవీందర్ , మార్కెట్ కమిటీ సిబ్బంది తదితలు పాల్గొన్నారు.

# 19న జూలూసే ముహమ్మదిని, ఆధ్యాత్మిక సదస్సును జయప్రదం చేయండి...

**• జూలూసే ముహమ్మదీ పోస్టర్ ఆవిష్కరించిన మర్కజీ మిలాద్ కమిటీ సభ్యులు • ర్యాలీలో బైక్ లకు అనుమతి లేదు..ఎవరైనా బైక్ ర్యాలీ తీస్తే మర్కజీ మిలాద్ కమిటీకి సంభంధం లేదు • మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్ బాబా..ఉపాధ్యక్షుడు జమీలుద్దీన్ స్పష్టీకరణ**



**కరీంనగర్, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని ఈనెల 19న గురువారం జూలూసే ముహమ్మదీ శాంతిర్యాలీని (పాదయాత్ర)ను ఉమ్మడి జిల్లా నుంచి, నగర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు హాజరై విజయవంతం చేయాలని మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు ముంబై బాబా ఫరీద్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ జమిలోద్దీన్ ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. మంగళవారం ముంబై స్కూల్లో జూలూసే మహమ్మది పోస్టర్ ను, మర్కజీ మిలాద్ కమిటీ సభ్యులు, బాలాపూర్ సాహెబ్ సయ్యద్ షాహ్ నుస్రత్ హష్మి ఖాద్రి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జమిలోద్దీన్ క్లుప్తంగా వివరాలు వెల్లడించారు. ఉదయం ఫజర్ నమాజ్ అనంతరం ఆసారే ముబారక్ దర్శనం, లంగరే మూహమ్మది, అన్నదాన ప్రసాదం,ఉదయం పది గంటలకు జూలూసే మూహమ్మది హుస్సేనీపుర ముంబై స్కూల్ ఖాలీదీ గుల్షన్ నుంచి ప్రారంభమై, మహముదియా మస్జిద్, నాకా చౌరస్తా, గాంధీ చౌక్, మంచిర్యాల చౌరస్తా, మధ్యాహ్నం సవారన్ మస్జిద్ చేరుకొని, జుహార్ నమాజ్ ఆచరించి, గీతాభవన్ తెలంగాణ చౌక్ నుంచి, బస్టాండ్, వన్ టౌన్, తెలంగాణ అమరవీరుల స్థూపం, పొట్టి శ్రీరాములు చౌక్ మీదుగా రాజీవ్ అస్లామి మస్జిద్ నుంచి, పాత్ బజార్ సయ్యద్ కరీముల్లాహ్ షాహ్ దర్గాహ్ వద్ద ర్యాలీ ముగుస్తుందని తెలిపారు. రాత్రి 9గంటల నుంచి మహాత్మా జ్యోతిరావు పూలే మైదానం, సర్కస్ గ్రౌండ్ లో మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం సందర్భంగా ఈద్ మిలాదున్నబి జల్సా ఆధ్యాత్మిక సదస్సు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక బహిరంగ సభ సదస్సుకు ముంబై నగరానికి చెందిన సుప్రసిద్ధ సున్ని ధార్మిక పండితుడు ముఫ్తి జమాలొద్దిన్ సిద్ధిఖీ, ముఫ్తి సయ్యద్ షాహ్ ఖియాసోద్దిన్ ఉత్తరప్రదేశ్ నుంచి ముఖ్యవక్తలుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు కరీంనగర్ నగర నలుమూలల నుంచి కరీంనగర్ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ముస్లిం సోదరులు తరలివచ్చి జూలూసే మహమ్మదీ ర్యాలీని, ఆధ్యాత్మిక సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ హాబీదుద్దీన్ హాజీ, సుప్రీం జావిద్, ప్రధాన కార్యదర్శులు గులాం రబ్బానీ ఖాద్రి, గౌరవ అధ్యక్షుడు సయ్యద్ గౌసోద్దీన్ ఖాద్రి, ఎవన్ రియల్ ఎస్టేట్ ఎండి అంజద్ ఖాన్ ముజ్జు, ఇబ్రహీం రజా, షేఖ్ పాషా ఖాద్రి, మహమ్మద్ సలీం, అబ్దుల్ రహమాన్ రజ్వి, ఎంఐఎం నేత అజర్ దబీర్, జియారహమాన్, వలిపాషా, మిర్జా అస్మత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# 1948, సెప్టెంబర్-17 ముమ్మాటికి విద్రోహ ధినమే...

**• ప్రజాసంఘాల సమావేశంలో భారతదేశ రాజకీయ సమాఖ్యా వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ ద్రావీడ స్పష్టం**



**జవహర్ నగర్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిజాం ఫ్యూడల్ వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో పెకిలించడానికి జరిగిన మహోజ్వాల రైతాంగ సాయుధ పోరాటాన్ని అణిచివేయడానికి చేసిన కుట్రలో బాగమే1948, సెప్టెంబర్-17 న నెహ్రూ-నిజాం విలీన ప్రకటన ముమ్మాటికీ వీద్రోహ చర్యలో బాగమేనని ధక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ ద్రావీడ ముఖ్య వక్తగా హాజరై స్పష్టం చేశారు. 2024, సెప్టెంబర్-17, మంగళవారం రోజు మేడ్చల్, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి అనుబంధ ప్రజాసంఘాల ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈపై కార్యక్రమం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ)-శ్రామిక స్పందన) హైదరాబాద్ జంటనగరాల కన్వీనర్ బడిగే వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. భారత యూనియన్ సైనాలు హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో కలూపుకొనే వంకతో ప్రధాని నెహ్రూ, హెూంమినిస్టర్ పటేల్ ఆడిన డ్రామాలో నైజాం మీద చర్య పేరుతో కమ్యూనిస్టుల నాయకత్వాన వీరోచితంగా వ్యవసాయిక విప్లవం విజయవంతం మవుతున్న క్రమంలో నిజాం, నేహ్రూ సైన్యాలు సంయుక్తంగా కలిసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోదులపై, ప్రజలు, మహిళలు, రైతులు, కార్మికులు, మేదావులపై విరుచుపడ్డాయని అన్నారు. హైదరాబాద్ సంస్థానం 1948 వరకు అసఫ్ జాహీ నవాబుల పాలనలో ఉండేదని, దీనినే ఖాల్సా, గైర్ ఖాల్సా అనే రెండు ప్రాంతాలుగా పిలుచుకునే వారని గుర్తుచేశారు. ఖాల్సా ప్రాంతం నవాబు ఆధీనంలో ఉంటే?, గైర్ ఖాల్సా జమీందారు, జాగీరుదారి, మక్తాదారి, పాయిగాలు, దేశ్ముఖ్లా ఆధ్వర్యంలో పాలన ఉండేదని వెల్లడించారు. మరాఠ నుండి-5, కన్నడ నుండి-3, తెలుగు ప్రాంతం నుండి-8 జిల్లాలు కలుపుకొని సుమారు కోటిన్నర పైగా జనాభ కలిగిన ప్రజలు ఉండే హైదరాబాద్ నిజాం సంస్థానంలో తెలుగు ప్రజలే ఒక కోటి జనాభా ఉంటుందని తెలియజేశారు. కాలం పట్టిన భూస్వామ్య వ్యవస్థను అంతంచేసి, భూమిలేని దళితులు, వ్యవసాయ కూలీలు, రైతులకు, గిరిజనులకు స్త్రీలకు భూమిపై హక్కును కల్పించడానికి జరిగిన పోరాటాన్ని విలీనం, విమోచన, సమైఖ్య పేర్లతో తిరిగి ప్రజలలో దోపిడీ, పీడనలను, ఆచారాలాను, మూఢ నమ్మకాలను అభివృద్ధి నిరోధక విధానాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. బడా భూర్జువా, భూస్వామ్య, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, స్వతంత్ర పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తించి, ప్రతిన బూనాలని రషీద్ పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులు ముస్లిం-హిందువులకు మద్య జరిగిన ఘర్షణగా చరిత్రను వక్రీకరించి, విద్వేష రాజకీయాలతో ప్రజల ఐక్యతను దెబ్బతీసే చర్యలు వేగవంతమయ్యాయని అన్నారు. ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి, ఐపిఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత, శ్రీనివాస్, సుదాకర్, జమున, ప్రియా తధితరులు ఈపై కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించాలి

**• తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో రవీందర్ రెడ్డి**

**• ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు**



**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించి భావితరాలకు అందించాలని బిజెపి భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు చేవ్వ శేషగిరి యాదవ్ నేతృత్వంలో మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మోరే రవీందర్ రెడ్డి ప్రజలను, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. దేశానికంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే..హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం రజాకార్ల పాలనలో మగ్గింది. తెలంగాణలో నిజాం రజాకర్ల ఆగడాలకు హద్దే లేకుండా పోతుంది. నిజాం రజాకార్లు ఇళ్లలోకి చొరబడి మగవాళ్లను కాల్చి చంపుతూ..ఆడవాళ్లను మానభంగాలు చేస్తూ..బరిబాత బతుకమ్మలను ఆడిస్తూ..వార్తలు రాసిన విలేకర్ల చేతులను నరికేస్తూ..నరకయాతనను చూపిస్తున్న రజాకారులపై తెలంగాణ ప్రజలు తిరగబడేడంతో..నాటి హెూం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వీరత్వంతో తెలంగాణ విముక్తమైంది. నాటి చరిత్రను తెలంగాణకు రాబోయే పౌరులకు అందించి..తెలంగాణ చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. విమోచనమా..లేకుంటే ఎంఐఎం పార్టీతో స్నేహమా..? అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. లేకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని రవీందర్ రెడ్డి హెచ్చరించారు.అదే విదంగా ప్రపంచం నేచ్చిన నేత మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.. అనంతరం కేకు కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు కుమ్మరి సారయ్య బండారి రవీందర్, వేముల రాజయ్య,మోరే వేణుగోపాల్ రెడ్డి,బండారి శ్రీనివాస్ పులి వెంకట్ రెడ్డి,పోతుగంటి సాయిలు, సమ్మోజు భాస్కర్, బల్గురి కిషన్ రావు వైనాల ప్రియాంక శివకుమార్,తెప్ప రాజు అనుముల శ్రీనివాస్, గూడూరి మహిపాల్ రెడ్డి, జన్నె దిలీప్ రాజేశం, కాక్కర్ల వీరన్న, నర్సింహా రాములు తదితరులు పాల్గొన్నారు.

# పిసిడబ్ల్యూ న్యూస్ వార్త కథనానికి స్పందన

**- ఇది గుర్తుర్ చెరువు కాలువ కాదు ప్రధాన రహదారి అనే కథనం పిసి డబ్ల్యూ న్యూస్‌లో ప్రత్యుత్తమయింది**

**తొర్రూర్, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** బస్టాండ్ ప్రాంతం నుండి ప్రధాన రహదారిలో గల గ్రామం మధ్యలో ఉండే రహదారి గృహాల కింది నుండి భారీగా ఉటలు వస్తు రహదారి పూర్తిగా జలమయిపోయి వాహనదారులకు పాదఛారుల కు ప్రాణ సంకటంగా మారింది. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కార్యదర్శి గ్రామ సిబ్బందితో ఒకవైపు కాల్వలాగా చేసి నీరు దిగువక పోయేలాగా చేయడంతో కొంతవరకు మార్గం సుగమం అయ్యిందని గ్రామస్తులు పేర్కొన్నారు. తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వతపరిష్కారం కోసం ఒకవైపు కాల్వను నిర్మిస్తే తప్ప ప్రమాద బారి నుంచి బయట పడినట్లుగా అవుతుందని కార్యదర్శిగా మీరు ప్రజా ప్రతినిధులు దృష్టికితీసుకు వెళ్లాలని కోరుతున్నారు.



# తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి ఆధ్వర్యంలో పెరియార్ రామస్వామి జయంతి



**కాప్రా, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంగళవారం ఉదయం 11 గంటలకు కమలానగర్ ఆఫీసులో సుప్రసిద్ధ హేతువాది ద్రావిడ ఉద్యమ నేత ప్రజా ఉద్యమాలలో తనదైన శైలిని రూపొందించిన ప్రముఖులు పెరియార్ రామస్వామి జయంతి సందర్భంగా సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు స్ఫూర్తి గ్రూపు సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ అధ్యక్ష వహించారు. ముందుగా పెరియార్ రామస్వామి చిత్రపటానికి ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు జె చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో అనేకమంది సంఘసంస్కర్తలు అభ్యుదయ భావాలతోటి మత భావాలను తుత్తునియం చేస్తూ వాస్తవ దృక్పథాన్ని ప్రజల్లో తీసుకెళ్లిన గొప్ప జ్ఞాని అన్నారు. సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ, పెరియార్ రామస్వామి నాయకర్ గారు అభ్యుదయ ఉద్యమానికి నాస్తిక భావజాలానికి భౌతిక దృక్పథానికి ఆయన పెట్టింది పేరు అని అన్నారు. ఆయన తమిళనాడులో బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యపరిచి వారి విధానాలను తరిమి కొట్టారని చెప్పారు. మనుషులందరూ ఒక్కటే కులాలుగా చీల్చి అంటరాని వారిగా మార్చి ప్రజలను బానిసలుగా చేసుకున్నారని వాటికి వ్యతిరేకంగా నికరంగా పోరాడాలని చెప్పారు. అంతేకాదు ఆయన నిజ జీవితంలో ఆచరించి చూపారని చెప్పారు. ఇప్పటికీ దక్షిణాదిలోనూ ముఖ్యంగా తమిళనాడులో ఆయన రూపొందించిన పద్ధతులను నేటికీ ఆచరణీయంగా కొనసాగుతుందని చెప్పారు. విద్యార్థి నాయకుడు శ్యామ్, పెరియార్ రామస్వామి పై పాటను రాసి పాడి వినిపించారు. సభికులందరూ కరతాల ధ్వనులతో అభినందించారు. అనంతరం సభికులందరూ పెరియార్ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసరావు, జి శివరామకృష్ణ, ఆర్ ఎస్ ఆర్ ప్రసాద్, విద్యార్థి నాయకులు సంతోష్, మునేష్,ప్రశాంత్, రుక్కయ్య, గౌసియా, శోభ, లక్ష్మయ్య, ఎం శ్రీనివాస్, వెంకటరమణయ్య, ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలలో మున్సిపల్ కార్మికుల సేవలు భేష్

**• దొంతి గోపి 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కరీంనగర్ • మునిసిపల్ సిబ్బంది, కార్మికులకు కృతజ్ఞతలు.. • మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ ప్రతినిధులు...**



**కరీంనగర్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తొమ్మిది రోజుల పాటు కొనసాగిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ కార్మిక సిబ్బంది ఎంతో శ్రమపడి ప్రతి గణేష్ మండపం వద్ద ఎప్పటి కప్పుడు చెత్తను తొలగిస్తూ వ్యర్థాలు పేరుకుపోకుండా అటు భక్తులకు, ఇటు నగరవాసులకు పూర్తి సౌకర్యవంతంగా ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి కృషి చేయడం పట్ల 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతి గోపి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన మున్సిపల్ కార్మికులు మరియు అన్ని విభాగాల సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ నగర మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతాభివందనాలు తెలియజేయడం జరిగింది.అర్ధరాత్రి వరకు కొనసాగిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పర్యావరణాన్ని కాపాడే విధంగా పూర్తి బాధ్యతగా వ్యవహరించడం వారి కర్తవ్యం నిర్వహణకు నిదర్శనమని, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఎప్పటికీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.కమిషనర్ ను కలిసిన వారిలో నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు పొన్నం మధు, పలు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పోరండ్ల రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అమెర్, గంగుల దిలీప్, కొలగాని అనిల్, ఆశిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మల్కాజిగిరిలో మండల మహాసభ

**- మహిళలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలి జెండా ఆవిష్కరణ**

**మల్కాజ్గిరి, 17(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** వీరనారి మల్లు స్వరాజ్యం చిట్యాల ఐలమ్మ, ఎన్ ఎస్ లక్ష్మీదేవిమ్మ చిత్రపటాలకు పూలమాలవేసి మహాసభను ప్రారంభించడం జరిగిందిఐద్వా మల్కాజిగిరి మండల మహాసభలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం వినోద మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు హత్యలు దాడులు హింస అరికట్టడంలో విఫలమయ్యారు ఫ్రాస్టాక్ కోర్టులను ఏర్పాటు చేయాల అన్నారు 33 రిజర్వేషన్ కాగితాలకే పరిమితమైంది అమల్లోకి తీసుకరావాలి మహిళల హక్కుల సాధన కోసం మహిళలకు రక్షణ కల్పించమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు బిజెపి వచ్చిన నుండి మహిళలపై హింసలు దాడులు అధికంగా పెరిగిపోయాయి మహిళలకు రక్షణ కరువైపోయింది ఎందరో మహిళలు సాయుధ పోరాటంలో మహిళలు స్వాతంత్ర ఉద్యమంలో ముందుండి పోరాటం చేశారు మహిళా హక్కుల సాధన కోసం వారి ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడారుఈ కార్యక్రమంలోకెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కృపా సాగర్ మాట్లాడారు సిఐటియు మండల కార్యదర్శి బంగారు నర్సింగ్ రావు మాట్లాడారు కెవిపిఎస్ మండల కార్యదర్శిగుంటి లక్ష్మణ్ మాట్లాడారు పీ మీనా కుమారిమాట్లాడారు.అనేక అంశాల మీద మద్యం గంజాయి డ్రగ్స్ మాదకద్రవ్యాలు అరికట్టాలని మహాసభల సందర్భంగా తీర్మానం చేయడం జరిగింది. (రాష్ట్ర మహాసభలను జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు)జిల్లా నాయకులు సపియ సుల్తానా శ్రామిక మహిళ మండల నాయకురాలు సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది 15 మందితో గౌరవ అధ్యక్షులు పీ మీనా కుమారి, అధ్యక్షురాలు ఎస్ నాగమణి, ప్రధాన కార్యదర్శి పి మంగ, కోశాధికారి జి షాహిన్ , ఉపాధ్యక్షులు నజీమా రాజ్యలక్ష్మి, సహాయ కార్యదర్శి అరుణకుమారి లక్ష్మీ పద్మావతి, కమిటీ సభ్యులు బి సునంద కె పద్మ ,బి లలిత, శాంత, పి లలిత, షైనాస్ శోభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.




# దయారాలో ఘనంగా పెరియర్ జయంతి వేడుకలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం లోని దయారా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పెరియర్ ఇ.వి. రామస్వామి 145 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించరు, ఈ వేడుకలకు ముఖ్య అతిధిలుగా అంబేద్కర్ వాదులు మధు,చిన్న అంజనీ, పాడుగుల చంద్రమౌళి పాల్గోన్నారు,మాట్లాడుతు ఆత్మగౌరవ, స్త్రీ హక్కుల, పీడీత ప్రజల తరుపున పోరాటం చేశారు, అణిచివేత ఏ స్థయిలో ఉన్న అది నా శత్రువే అనీ గర్జించిన ద్రావిడ సూర్యుడు బ్రాహ్మణ దోపిడీ వ్యవస్థను కూల్చి అడుగంటిన ఆత్మగౌరవం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మహనీయులు నాయకర్ అని అన్నారు, అంతకు ముందు మధు, పాడుగుల చంద్రమౌళి అంబేద్కర్ మహనీయునీకి జ్ఞానమాల వేసి జ్ఞాన జ్యోతిని వెలిగించి బుద్ధ వందనం చేశారు, కార్యక్రమంలో సింగూరు పాండు, బేగరి నర్సింహా, దుబాల మురళి,మద్దెల గిరి, కన్నయ్య తదితరులు పాల్గొని పెరియార్ కు ఘనంగా నివాళిలు అర్పించారు. అనంతరం ఇంత గొప్పగా కార్యక్రమం చేసి మకు ఆహ్వానం పంపినందుకు అంబేద్కర్ సంఘానికి ధన్యవాదములు చెప్పారు.

# జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్



**మహబూబాబాద్ జిల్లా,17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. విచ్చేసిన డాక్టర్ రాంచందర్ నాయక్ కు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ,ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.ఆ తర్వాత జాతీయ పతాకావిష్కరణ చేశారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లాకు సంబంధించిన సందేశాన్ని తెలియజేసారు. ఆ తర్వాత పలు పాఠశాలల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాన్ని వీక్షించి విద్యార్థులను అభినందించారు.

# నాణ్యతలేని విద్యా ప్రమాణాలు: రవి రాజ్ రాథోడ్

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,సెప్టెంబర్ 17,(పి సి డబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పలు యూనివర్సిటీలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. కేటాయిస్తున్న నిధులు సరిపోక, రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక విశ్వవిద్యాలయాలు విలవిల్లాడుతున్నాయి. కొన్ని వర్సిటీలలో ఇంచార్జి విసిలతో, కాంట్రాక్ట్ అధ్యాపకులతో నెట్టుకొచ్చేస్తున్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీల సమస్యలు పరిష్కారం చేసి వాటిని అభివృద్ధి దిశగా నడిపించాలని అశేష విద్యార్థిలోకం కోరుతోంది. అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడం, రిసెర్చ్ గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో పరిశోధనలు పక్కదారి పట్టాయి. అభివృద్ధి, నాణ్యత లేక ప్రమాణాలు దిగజారిపోయి ర్యాంకింగులలో పడిపోతున్నాయి. ఫలితంగా క్యాంపస్ రిక్రూట్మెంట్లలో కూడా మన ఉన్నత విద్యా సంస్థలు క్రమంగా వెనుకపడిపోతుండడం దురదృష్టకరం అని ఎన్ బి ఎం ఐ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రవి రాజ్ రాథోడ్ అన్నారు, అదేవిధంగా విద్యా ప్రమాణాలను పెంచడానికి విశ్వవిద్యాలయాలను నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.



## రిక్కి భౌతికకాయానికి నివాళు లర్పించిన ఎంపీ డా.కడియం కావ్య-డాక్టర్ నజీర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిల్పూర్ మండలం, చిన్న పెండ్యాల మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్ కుమారుడు ఇల్లందుల రిక్కీ అనారోగ్యంతో మృతి చెందగా.., ఇట్టి విషయం తెలుసుకొని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య-డాక్టర్ నజీర్, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం వారి నివాసం చేరుకొని, వారి భౌతిక కాయానికి పూల మాలవేసి నివాళుల ర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**- జాతీయ జెండాను ఆవిష్కరించిన సిఐ మల్లేష్**



**చిట్యాల, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగాలతోనే నిజం సంస్థానం ఇండియన్ యూనియన్ గవర్నమెంట్ లో మిలీన మైందని 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు స్వాతంత్రం సిద్ధించిందని సీఐ మల్లేష్ అన్నారు ప్రజలకు పోలీసు అధికారులకు సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్ కుమార్ , ఏఎస్ఐ సమ్మిరెడ్డి , హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్ అస్లాం, నవీన్, లింగన్న, మమత, కోమల కోమల, పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లికి పాలాభిషేకం...



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన బిఆర్ఎస్ నాయకులు. ఇక్కడ సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, నేతలు గోపు పర్శరాములు, గోగు ప్రతాప రెడ్డి, అనుపటి భూంరెడ్డి, వంశీ కృష్ణ రావు, మందాల శ్రీనివాస్, దొంతరవేణి శ్రీనివాస్, కాషావేణి మహేష్ యాదవ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు అనబేరి ప్రభాకర్ రావుకు ఘన నివాళి

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి,17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ పట్టణంలోనీ సాయుధ పోరాట వీరుడు కరీంనగర్ జిల్లా సిపిఐ పార్టీ మొట్టమొదటి జిల్లా కార్యదర్శి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం చేసి నిజాం సైన్యం దారుణానికి అసువులు బాసినకామ్రేడ్ అనభేరి ప్రభాకర్ రావు గారిలివిగ్రహానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి బోయిని తిరుపతి నాయకులు కార్యకర్తలు అభిమానులు




## గంగాధరలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు





**గంగాధర, 17(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధుర నగర్ లో ప్రపంచపు తొలి వాస్తు శిల్పిగా, సృష్టికర్తగా పేరు గాంచిన శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి మహోత్సవాన్ని మంగళవారం విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. స్వర్ణకార సంఘం మండల అధ్యక్షులు ఎర్రోజు ప్రసాద్, మనుమయ సంఘం మండల అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం మండల అధ్యక్షులు పాములపర్తి రవీంద్ర చారి ఆధ్వర్యంలో.స్థానిక హనుమాన్ నుండి చౌరస్తా మీదుగా శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకు శోభయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి పురోహితులు విశ్వ బ్రాహ్మణోత్తములచే పంచామృతాభిషేకం, అర్చన, గణపతి, గౌరీ పూజ, అష్టదిక్పాలక పూజ, విరాట్ విశ్వకర్మ షోడపచార పూజలు నిర్వహించారు.గంగాధర మండలం ఆయా గ్రామాలకు చెందిన కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకార పంచదాయ వృత్తుల విశ్వబ్రాహ్మణులు ఉత్సవానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ పాల్గొని విశ్వకర్మ భగవానునికి పూలమాలవేసి శోభయాత్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పనిముట్ల తయారీ నిర్మాణానికి భగవాన్ శ్రీ విశ్వకర్మే ఆద్యులని పేర్కొన్నారు.అపూర్వమైన ఆదిమ వాస్తు గ్రంథం విశ్వ కర్మ రచించినదేనని సమస్త చేతి వృత్తుల వారికీ ఈయనే మూల పురుషుడని అన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ కులవృత్తుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు.భారతీయ జనతా పార్టీ జిల్లా కోశాధికారి, గంగాధర మాజీ సర్పంచ్ వైద రామానుజం మాట్లాడుతూ పూర్వకాలం నుండి మనిషి అభివృద్ధి చెందే క్రమంలో ఆహారానికి, వ్యవసాయం, రక్షణకు తదితర పరికరాలు విశ్వకర్మనే రూపొందించారని అన్నారు. చేతివృత్తి వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకాన్ని తీసుకువచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారికంగా ప్రకటించిన మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు కనపర్తి శ్రీనివాస్, శ్రీకళ శ్రీనివాస్,వెంగళం కృష్ణ, కట్ట నరసింహ చారి, శ్రీరామోజు మధు, చంద్రమౌళి, గాలిపెల్లి గంగా చారి, సాయి కృష్ణ, వెంకటేశ్వర్లు, పాములపర్తి నర్సయ్య, రామస్వామి, కొత్తపల్లి దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినం జాతీయ జెండావిష్కరణ



**తొర్రూరు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తొర్రూరు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.స్థానిక వివేకానంద సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం మొత్తానికి ఆగస్టు 15,1947లో స్వాతంత్రం సిద్దిస్తే నిజాం నవాబు పాలనలో ఉన్న తెలంగాణా ప్రాంతానికి మాత్రం సెప్టెంబర్ 17,1948లో స్వాతంత్రం వచ్చింది అని, నిజాం నవాబు పాలనలో నరకం చవిచూసిన తెలంగాణ ప్రజలకు భారత ప్రథమ హోం మంత్రి వర్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి ప్రత్యేక చొరవ చూపి ఆపరేషన్ పోలో ద్వారా నిజాం నవాబు మెడలు వంచి తెలంగాణ ప్రజలకు విముక్తి ప్రసాదించాడని తెలిపారు.సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు చాలా ముఖ్యమైన రోజు అని, తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా జరుపాలని నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసిఆర్ పై శివాలెత్తిన రేవంత్ రెడ్డి నేడు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు అని ప్రశ్నించారు.కేవలం మజ్లిస్ నేతల ఒత్తిడి కి తలొగ్గి కాంగ్రెస్ ప్రభుత్వం విమోచనా ఉత్సవాలు జరుపకుండా,ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోంది అని,గత రెండు సంవత్సరాలుగా నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణా విమోచనా ఉత్సవాలు చేపడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవిస్తుంది అని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన అమరుల త్యాగం,వారు చేసిన వీరోచిత గాథలు కాలగర్భంలో కలిసి పోకుండా రాబోయే తరాలకు నాటి పోరాట స్ఫూర్తిని తెలియజేసేందుకు ఆనాటిపోరాట ఘట్టాలను,వీరుల చరిత్ర ను పాఠ్యాంశాలు గా చేర్చాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, బీజేపీ బీజేవైఎం నాయకులు ,పైండ్ల రాజేష్, గడల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- **హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**హనుమకొండ ప్రతినిది, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ అదాలత్ కూడలిలోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పూలను సమర్పించి అంజలి ఘటించారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై కలెక్టరేట్ లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జాతీయ గీతాలాపన అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అదేవిధంగా రాష్ట్ర గీతమైన జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




## తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అన్ని వర్గాలకు స్వేచ్ఛ సామాజిక న్యాయం చేస్తుంది...



**హుస్నాబాద్, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** టీపీసీసీ సభ్యులు బొమ్మణపల్లి అశోక్ రెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలన, పారదర్శక పాలనతో సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సోనియా గాంధీ కృషితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను అన్ని రంగాల్లో అగ్ర భాగాన ఉంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ స్ఫూర్తితో నిరంతరం ప్రజా శ్రేయసే లక్ష్యంగా అవిశ్రాంతంగా పాటుపడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని బొమ్మనపల్లి అశోక్ రెడ్డి సూచించారు.

## వరద బాధితురాలికి స్నేహితుల 50 వేల ఆర్థిక సహాయం

**- ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం నింపిన చిరునాటి స్నేహితులు**



**మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల మహబూబాబాద్, ఖమ్మం జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల ఆకేరు వాగు ఉప్పొంగింది. ఆ వాగు ఉధృతంగా ఉప్పొంగి ప్రవహించడంతో ఖమ్మం కాలువ ఒడ్డు శివారు కాలనీలు నీట మునిగాయి. ఆ వరదల్లో కురవి మండలం అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన మా పదవ తరగతి చిన్ననాటి స్నేహితురాలైన టువంటి పుష్ప ఇల్లు నీట మునిగి ఆమె బతుకుతెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిరు కిరాణా దుకాణం వరద పాలైంది. ఈ ప్రమాద పరిస్థితి చూసి చలించి పోయిన పదవ తరగతి విద్యార్థులమైన మేము మంగళవారం అక్కడికి చేరుకొని పుష్పకు జరిగిన వరద నష్టాన్ని ఖమ్మంలోని ఆమె నివాసాన్ని చూసి ఆమెకు ధైర్యాన్ని నింపాము. ఆమెకు జరిగిన నష్టాన్ని భారీ స్థాయిలో పూడ్చ లేకపోయినప్పటికీ స్నేహితుల సహకారంతో రూ 50 వేల రూపాయలను ఆమెకు అందించాము. చిన్ననాటి స్నేహితులు బజ్జూరి లచ్చిరెడ్డి, బాలగని నవీన్ కుమార్, అక్కనపల్లి రమేష్, సిహెచ్ ప్రవీణ్, కొంపెల్లి అంజయ్య, దర్గయ్య లతో పాటు మరికొందరు స్నేహితుల సహకారంతో అందించాము.

## తెలంగాణకు నిజమైన వారసులు కమ్యూనిస్టులే..

- **బీజేపీ ఆర్ఎస్ఎస్‌లకు ఈ పోరాటంతో సంబంధంలేదు**
- **సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్**

**తొర్రూరు, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని పలు గ్రామంలో అమరవీరుల స్థూపాల వద్ద పుష్పాంజలి ఘటించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాముల భూమికోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిందని, తెలంగాణకు నిజమైన వారసులు కమ్యూనిస్టులే అని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం తోరూర్ మండలంలో కంటయపాలెం గుర్తూరు అమ్మపురం గోపాలగిరి గ్రామాలలో అమరవీరుల స్తూపాల కు పుష్పాంజలి ఘటించి సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ వారోత్సవాలను ముగింపు సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్ సిపిఎం తోరూర్ మండల కార్యదర్శి ఎండి యాకుబ్ లు మాట్లాడుతూ, భూస్వాములు, రజాకార్ల వెట్టిచాకిరీ నీ ఎదిరించి సామాన్య ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీ రగిలించిన చైతన్యం తో రైతులు నడిపిన నాటి పోరాటం చారిత్రాత్మకమైన దని అన్నారు. నాటి పోరాటం వల్ల 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదని వారికి సందర్భంగా గుర్తు చేశారు. ఈ పోరాటం ద్వారా 3 వేల గ్రామ ల లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటయ్యాయి అని వారు తెలిపారు.ఆ పోరాటంలో,దొడ్డి కొమరయ్య షోయబుల్లాఖాన్, పి.సుందరయ్య,ముగ్ధుమ్ మోహిణుద్దీన్, మల్లు స్వరాజ్యం లాంటి వారు వీరోచిత పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక,కులవివక్ష కు వ్యతిరేకంగా ఆ పోరాటం నేర్పిన అనుభవాలతో నేటి ప్రజలు దేశ సంపదలో సమాన వాటా కొరకు కుల,మతాలకు అతీతంగా,కేంద్ర రాష్ట్ర పాలకులు ఇచ్చిన వాగ్దానాల అమలుకోసం పోరాడాలని సూచించారు. ఆనాటి పోరాటం తో ఏమాత్రం సంబంధం లేని నే టీ బిజేపీ, ఆర్ ఎస్ ఎస్ సంస్థలు ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 వతేదీ వరకు వాడవాడలా ఈ వాస్తవాలు చెప్పాలని,ఆనాటి సామాన్య ప్రజలు, కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలను ఈ నాటి యువతకు తెలియజెప్పాలని కోరారు. నాటి పోరాట ఫలితంగానే తెలంగాణలో%ఇ% ఇప్పటికి అనేక ఉద్యమాలు కొనసాగుతున్నాయని అన్నారు కేంద్రంలో బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం నాటి చరిత్రను వక్రీకరిస్తూ రెండు సినిమాలు విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించి ఎలక్షన్లలో ఓటర్లను దండుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17 చరిత్రలో ఏం జరిగింది దాని ప్రాధాన్యత ఏమిటి ఎందుకు ఇంత వివాదాస్పదమవుతుందో ఇవన్నీ లోతుగా పరిశీలించాలని బిజెపి ఆర్ఎస్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఎండగడుతూనే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 కు వారసులు కమ్యూనిస్టులేనని సాయుధ పోరాటం లక్ష్యాలు ఇంకా నెరవేరలేదని ఆ నెరవేర్చే బాధ్యత ఈ తరం పై ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మా సిపిఎం పార్టీ తోరూర్ మండల నాయకులు , డోనక దర్గయ్య, మర్కా సాంబయ్య, గుద్దేటి సాయిమల్లు, ఉమగాని యాకయ్య, కొత్త వెంకట్రెడ్డి శంకరాచారి, ధరావత్ యాకన్న, సతీష్, ప్రమీల, శైలజ, తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**పాలకుర్తి, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రాంతానికి నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య ప్రసంగిస్తూ న్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి,పెదగాని సోమయ్య,కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందాడి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య వైస్ చైర్మన్ జీనుగా సురేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ భూసాని రాము,కోఆప్షన్ సభ్యుడు జలీల్, నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ చౌక్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలభిషేకం...



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్నటీ రోజున డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహంను ఆవిష్కరించాల్సిన స్థానంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ లో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగన్న ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు పట్ల నిరసన తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాస్కాబ్ మరియు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం ఘనంగా నిర్వహించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం లో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల నిరసన తెలియజేయడం జరిగింది.

# రజాకర్ల ఆకృత్యాలకు మద్దతిచినట్లేనా.?

## మోసపూరిత పాలనే ప్రభుత్వ లక్ష్యమా? బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 17(పీసీడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవ కార్యక్రమం జరుపకుండా ప్రజాపాలన పేరుతో వేడుకలు నిర్వహించడం రజాకర్ల ఆకృత్యాల పాలనకు మద్దతిచ్చినట్లేనా అంటూ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అధ్యక్షులు పాల్గొన్నారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్బంగా రామాలయం లో మోదీ పేరిట పూజారులచే అర్చన నిర్వహించారు.జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రేపు కరీంనగర్ జిల్లా లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షులు తెలిపారు. అనంతరం గ్రామం లో మొక్కలు నాటారు. సభ్యత్వ నమోదు ను వేగవంతం చేయాలని కోరారు. 8800002024 నంబర్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతీ బూత్ లో 200 పైగా సభ్యత్వాలను చేయించి బీజేపీ ని బలపర్చాలని అన్నారు. పార్టీ బలోపేతం వల్ల రాజకీయ వ్యవస్థ భాగుపడుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చేముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీ లు కావని అందుకే మోసపూరిత పాలన కు కాంగ్రెస్ నిర్వచనమని అన్నారు.నిజాం పాలనలో ప్రజలేదుర్కొన్న కష్టాలను గమనించినవారే తెలంగాణ విమోచన దినోత్సవం జరిపే సత్తా ఉన్నవాల్లని ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు.రుణ మాఫీ అంటూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.రేషన్ కార్డులు రేపు మాపంటూ కాలం వెళ్ళదీస్తున్నారని ఆరోపించారు. ఇలా మోస పూరిత లక్ష్యం తో పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి ప్రజలు బుద్ది చెబుతారని పేర్కొన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి,మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్,సభ్యత్వ నమోదు సహా ప్రముఖ్ గడ్డం అరుణ్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి కానుగంటి మధుకర్ రెడ్డి,వేల్పుల ఓదయ్య,ఎడ్ల భూంరెడ్డి,బూత్ అధ్యక్షులు సుద్దాల సతీష్,బండి స్వామి,గడ్డం లక్ష్మణ్,మారం శివ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కర్ర అనిల్ కుమార్ నియామకం



**రామడుగు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన కర్ర అనిల్ కుమార్ రెడ్డి తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించినట్లు రాష్ట్ర యూత్ అధ్యక్షులు ఎలిమినేటి సుమన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.. ఈ సందర్భంగా ఎన్నికైన కర్ర అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంఘాల ఐక్యవేదిక భవిష్యత్తులో చేపట్టబోయే ప్రతి కార్యక్రమంలో పాలుపంచుకొని కుల బంధువుల కోసం తన బాధ్యతను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.. ఎన్నికైన అనిల్ కుమార్ రెడ్డిని రెడ్డి సంఘాల నాయకులు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు వరంగల్ నగరంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని విశ్వకర్మవీధిలోని విశ్వకర్మ స్వర్ణకార వసతి భవనములో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాయజ్ఞం తో పాటు, రామన్నపేటలో విశ్వకర్మ కార్పెంటర్స్ డెవలప్ మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మద్విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాల్లో మంత్రి సురేఖ పాల్గొన్నారు. యజ్ఞస్థలికి చేరుకున్న మంత్రిగారికి కార్యక్రమ నిర్వాహకులు ఈ సందర్భంగా సాదర స్వాగతం పలికారు. శాలువా, పట్టు వస్త్రాలతో సత్కరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో, వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన యజ్ఞంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. యజ్ఞానికి హాజరైన పలువురికి మంత్రి సురేఖ తన స్వహస్తాలతో కంకణాలు కట్టారు. పలువురు మంత్రి సురేఖతో కలిసి ఫోటోలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించే, అభీష్టాలను నెరవేర్చే యజ్ఞాలు అత్యంత పవిత్రమైనవని అన్నారు. ప్రతి యేటా విశ్వకర్మలు నిర్వహించే యజ్ఞాలు సానుకూల దృక్పథాన్ని కలిగించడంతో పాటు, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయని తెలిపారు. భక్తి ప్రపత్తులతో, నిష్ఠతో చేపట్టే యజ్ఞాలు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు, సమాజానికి మంచి కలుగజేస్తాయని అన్నారు.

# ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా జాతీయ పతాకం ఆవిష్కరణ



**ములుగు జిల్లా, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశముల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం ను పురస్కరించుకొని జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమము గౌరవ ఎంపీడీవో శ్రీ జి జవహర్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించనైనది ఈ కార్యక్రమంలో గౌరవ తహసిల్దార్ శ్రీ సృజన కుమార్, సూపరిండెంట్ సాయి దుర్గ లక్ష్మి, ఇన్చార్జి ఎంపీఓ శరత్ బాబు, ఏపీవో ప్రసూన, కార్యాలయ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, మరియు మాజీ ఎంపిటిసి గోపి దాసు ఏడుకొండలు, పుర ప్రముఖులు మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండల ప్రజా పరిషత్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది

# గల్ఫ్" కార్మిక కుటుంబాలకు సర్కార్ బాసట

## - మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయ



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 17(పీసీడబ్ల్యూ న్యూస్):** గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న తెలంగాణ కార్మికులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన విభాగం (ఎన్ఆర్ఐ) ఈనెల 16న ఉత్తర్వులు(జీవోఎంఎస్ నెం.205) జారీ చేసిందని ఆయన తెలిపారు. బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి గల్ఫ్ దేశాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి అనేక మంది కార్మికులు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. చాలా ఏళ్లుగా గల్ఫ్ దేశాల్లోనే పని చేస్తున్న కార్మికులు పని ప్రదేశాల్లో జరిగే ప్రమాదాల వల్లనో, అనారోగ్య కారణాల వల్లనో కొందరు మృత్యువాత పడుతున్నారని, అలాంటి బాధిక కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించేందుకు నిర్ణయించిందని ఆయన వివరించారు. గల్ఫ్ లో మరణించిన కార్మికుని వారసునికి లేదా కుటుంబ సభ్యులకు ఈ ఎక్స్ గ్రేషియాను చెల్లిస్తారని, 07-12-2023న నుంచి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా పొందేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు.గల్ఫ్ కార్మికుల సమస్యలు, సంక్షేమాన్ని అధ్యయనం చేయడానికి ఒక సలహా కమిటీ నియమిస్తున్నదని, గల్ఫ్ దేశాల్లో మన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వలసలు, సంక్షేమం వంటి పలు అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అంతేకాకుండా గల్ఫ్ కార్మికుల కుటుంబాల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రస్తుతం హైదరాబాద్ ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న ప్రజావాణి కౌంటర్ల వద్ద ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణి కార్యాలయం ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తుందని ఆయన తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారని ఆయన వివరించారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారని, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు. సాధారణ పరిపాలన, ప్రణాళిక విభాగం, రెసిడెన్షియల్ పాఠశాలల కార్యక్రమాన్ని అమలు చేసే విభాగాలు తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు ఎమ్మెల్యే వివరించారు.

# తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ముందు పెట్టడం తెలంగాణ సమాజానికి అవమానం



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణకు వ్యతిరేకంగా నేడు బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు రావుల రమేష్ గారి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఎటువంటి సంబంధం లేని నాయకుల విగ్రహాలను తెలంగాణ సచివాలయంలో పెట్టడాన్ని తెలంగాణ యావత్ సమాజం వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిని పరిపాలనను గాలికి వదిలేసి విగ్రహాలు ,విధ్వంసాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఉల్లెంగుల పద్మ, సాయిల్ల కొమురయ్య,పొన్నం అనీల్ గౌడ్, పాశం అశోక్ రెడ్డి,బుడిగే పర్శరాములు, కోయాడ మురళీ, ఖమ్మం కృష్ణ,కొమ్ము సంపత్,జగదీష్, సుదగోని సదయ్య గౌడ్, వేణుకుమార్, తిరుపతి, కొమురయ్య, కిషోర్,సంపత్,శ్రీనివాస్,సంపత్,తదితరులు పాల్గొన్నారు.

# దేవాపూర్ మైత్రి గణేష్ మండలి గణనాథుని లడ్డును 60 వేలకు దక్కించుకున్న శ్యాంసింగ్



**కాసిపేట మండల ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పీసి డబ్ల్యూ న్యూస్):** పూజలలో మొదటి పూజ అందుకునేది గణనాథుడే. ఎంతో భక్తిశ్రద్ధలతో నిష్టతో నవరాత్రులను పూజలు అందుకుని లంబోదరుడు చేతిలోని లడ్డు ఎంత రుచి అనేది ఎవరికీ అంత చిక్కని ప్రశ్న. విఘ్నేశ్వరుని చేతిలో పూజలకు ముందు అమర్చే లడ్డు ఖరీదు తక్కువే అయినప్పటికీ నవరాత్రి పూజల అనంతరం ఆ లడ్డుకున్న విలువ ఎంత అనేది ఎవరు చెప్పలేని విధంగా ఉంటుంది. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ మైత్రి గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధుని చేతిలోని లడ్డును 60 వేలకు పాట పాడి అందుకున్న లడ్డును అతని శిరస్సుపై స్వగృహానికి తీసుకెళున్నారు. గణనాథుని చేతిలోని లడ్డూలు ఒకనాడు వందల రూపాయల ఉండగా లక్షల రూపాయల నుండి కోట్ల రూ.ల వరకు చేరుకోవడం వంటి మామూలు విషయం కాదు.

# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరణ



**ములుగు జిల్లా, సెప్టెంబర్ 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని చల్వాయి గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్రవ్యాప్తంగా జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలి అని చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మరియు గోవిందరావుపేట ఎంపీడీవో జవహర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ భారతి, మాజీ ఉపసర్పంచ్ తేళ్ల హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీలు చాపల ఉమాదేవి నరేందర్ రెడ్డి గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ కుమార్ యాదవ్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తేళ్ల హరిత హరిప్రసాద్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పైడాకుల కృష్ణమూర్తి కాసర్ల రాంబాబు చిక్కుళ్ళ వెంకటేష్ బిజ్జా సురేష్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి లభించిన రోజు భారత్ మాతాకీ జై

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ గ్రామంలో జాతీయ పతాకాన్ని ఎగరవేయడం జరిగింది. ఈ సందర్భముగా నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన రోజు తెలంగాణ సమాజం స్వేచ్ఛా వాయువులు పొంది భారత దేశంలో హైదరాబాద్ రాష్ట్రం విలీనం అయినా సందర్భాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు కార్యక్రమానంతరం భరతమాత ముద్దుబిడ్డ మన నరేంద్ర మోడీ గారి పుట్టినరోజు సందర్భంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,ఎడ్ల భూంరెడ్డి,వేల్పుల ఓదయ్య, కిన్నెర ముత్తు లింగం, ఇనుకొండ విట్టల్,సంపత్ మల్లయ్య, నరేష్,రాజు, జీవన్,రాజారామ్ ,బూత్ అధ్యక్షులు.. కోతి రాజ్ కుమార్, ఆవుల వేణు, రేగూరి సుగుణాకర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

